సాక్షి
మహబూబాబాద్

1

బుధవారం | 29 | నవంబర్ | 2023

సాక్షి
మహబూబాబాద్
బుధవారం | 29 | నవంబర్ | 2023



అవినీతి పాలనకు చరమగీతం పాడాలి
- కాంగ్రెస్ అభ్యర్థి మురళీనాయక్, బెల్లయ్యనాయక్
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, రోడ్‌షో

- 3లో▸



అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- అభివృద్ధిని చూసి ఓటేయండి
- బీఆర్ఎస్ మానుకోట అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్

- 3లో▸



నన్ను ఓడించాలని కంకణం కట్టుకున్నాడు..
- సురేందర్‌రెడ్డి తన స్వార్థం కోసం రాజకీయాల్లోకి తీసుకొచ్చాడు
- బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి రెడ్యానాయక్

- 3లో▸

న్యూస్‌రీల్

పాలకుర్తిని వీడాలని ఝాన్సీరెడ్డికి నోటీసులు

- తొర్రూరులో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన



తొర్రూరు: ఎన్నికల ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో స్థానికేతరులు పాలకుర్తి నియోజకవర్గాన్ని వీడాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎన్ఆర్ఐ ఝాన్సీరెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేయడం స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం రాత్రి డీఎస్పీ వెంకటేశ్వరబాబు తొర్రూరు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లి ఆమెకు నోటీసులు జారీ చేశారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. ఇదెక్కడి అన్యాయమంటూ ఝాన్సీరెడ్డి పోలీసులను ప్రశ్నించారు. తన కోడలు యశస్వినిరెడ్డిని బరిలో నిలిపానని, తాను నియోజకవర్గంలోని చెర్లపాలాన్ని దత్తత తీసుకున్నానని, ఇక్కడ పన్నులు కడుతున్నానని, తనను నియోజకవర్గం వీడాలనడం సరికాదన్నారు. కుట్ర పూరితంగా తనకు నోటీసులు జారీ చేశారన్నారు. దీనికి మంత్రి దయాకర్‌రావు బాధ్యత వహించాలన్నారు. కనీసం ఆడవాళ్లు అని చూడకుండా ఇబ్బంది పెట్టడం ఏంటని ప్రశ్నించారు.

30న వేతనంతో కూడిన సెలవు

మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకొని ఈనెల 30న రాష్ట్ర కార్మికశాఖ వేతనంతో కూడిన సెలవు ప్రకటించిందని జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ జగదీశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం దుకాణాలు, సంస్థలు, కర్మాగారాలు, ప్రైవేట్ వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించిందన్నారు. కార్మికులు, ఉద్యోగులు తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు.

చప్పుడు బంద్!

ముగిసిన ప్రచార పర్వం.. మూగబోయిన మైకులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రలోభాలకు తెర
- మిగిలింది ఒక్కరోజు మాత్రమే..
- నేటిరాత్రే అభ్యర్థులకు కీలకం!



సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. నోటిఫికేషన్ నుంచి హోరెత్తిన మైకులు మూగబోయాయి. చివరిరోజు అన్ని నియోజకవర్గాల్లోని అన్ని పార్టీల అభ్యర్థులతో పాటు స్వంతంత్రులు కూడా తమదైన శైలిలో ప్రచారం ముమ్మరం చేశారు. నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా గల్లీగల్లీ కలియ తిరిగారు. కాగా ప్రచారం ముగియడంతో ప్రలోభాలకు తెర లేపారు. బుధవారం రాత్రి అభ్యర్థులకు కీలకం కానున్న నేపథ్యంలో.. అందుకు అనుగుణంగా శ్రమించాలని అనుచర వర్గానికి దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

ప్రచారం క్లోజ్..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు అన్ని పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్రులు ప్రచారం ముగించారు. చివరిరోజు కావడంతో జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలతో పాటు ములుగు, పాలకుర్తి, ఇల్లెందు నియోకవర్గాల పరిధిలోని మండలాల్లో కూడా ముమ్మర ప్రచారం చేశారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించాయి. అభ్యర్థులు, వారి తరఫున నాయకులు రోడ్డు షోలు చేశారు. అదే విధంగా కేసముద్రం మండలం ఉప్పరపల్లి, అర్పనపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ప్రచారం చేశారు. మహబూబాబాద్ రోడ్‌షోలో మురళీ నాయక్ పాల్గొని ఒక్క అవకాశం ఇవ్వాలని కోరా రు. టీఆర్ఎస్ ర్యాలీలో మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ప్రసంగించి సంక్షేమానికి ఓటు వేయాలని కోరారు. బీజేపీ అభ్యర్థి హుస్సేన్ నాయక్‌తో పాటు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. అదే విధంగా డోర్నకల్ నియోకవర్గంలోని వివిధ మండలాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు రెడ్యానాయక్, రాంచంద్రునాయక్, సంగీత ప్రచారం నిర్వహించి ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

ప్రలోభాలకు ఎర

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. గురువారం ఎన్నికల పోలింగ్ జరగనుండడంతో.. బుధవారం ఒక్కరోజే సమయం ఉంది. అది కూడా రహస్య సమావేశాల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలి. అయితే ముఖ్యంగా ఇంతకాలం చేసిన ప్రచారానికి కార్యరూపం దాల్చాలంటే.. ఆఖరి అస్త్రం డబ్బులు పంచేందుకు అన్ని పార్టీలు సిద్ధమయ్యాయి. అయితే ఇప్పటికే పలు పార్టీల అభ్యర్థుల అనుచరులు మహబూబాబాద్ పట్టణంతో పాటు వివిధ మండలాల్లో ఓటుకు నోటు లెక్క కట్టి పంపిణీ కూడా చేసినట్లు ప్రచారం. ఓటుకు ఒక పార్టీ నాయకులు రూ.1000 చొప్పున పంపిణీ చేసేందుకు సిద్ధపడగా.. మరో పార్టీ నాయకులు అంతే ఇద్దామా.. లేదా పెంచి ఇద్దామా అనే విషయంపై తర్జనభర్జన పడుతున్నారు. కాగా బృందాలను ఏర్పాటు చేసి పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు.

చేతులు మారనున్న కోట్ల రూపాయలు..

మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలతోపాటు పాలకుర్తిలోని తొర్రూరు, పెద్దవంగర, ములుగులోని కొత్తగూడ, గంగారం, ఇల్లెందు నియోజకవర్గంలోని గార్ల, బయ్యారం ఓటర్లపై కూడా అభ్యర్థులు ఎక్కువగా గురిపెట్టారు. జిల్లాలో ఆరు లక్షలకు పైగా ఓట్లు ఉన్నాయి. ఇందులో కనీసం 5లక్షల ఓట్లకు డబ్బులు పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఓటుకు రూ.వెయ్యికి తక్కువ కాకుండా పంపిణీ చేస్తే ఒక్కో పార్టీ నుంచి సుమారుగా రూ. 50కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా అన్ని పార్టీల అభ్యర్థులు డబ్బులు పంపిణీ చేస్తే జిల్లాలో రూ.200 కోట్ల మేరకు బుధవారం ఒక్క రోజే చేతులు మారే అవకాశం ఉందని ప్రజలు లెక్కలు వేస్తున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో ఈ నెల 30న ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ఉంటుందని, అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పూర్తిస్థాయిలో రెండు నియోజకవర్గాలు ఉన్నాయని, మానుకోటలో 2,53,342 మంది ఓటర్లకు 283 పోలింగ్ కేంద్రాలు, డోర్నకల్‌లో 2,19,264 మంది ఓటర్లకు 256 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 6,601 మంది, యువ ఓటర్లు 19,588 మంది, దివ్యాంగ ఓటర్లు 12,691మంది ఉన్నారని, రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికమని చెప్పారు. సీ–విజిల్ యాప్‌లో అందిన ఫిర్యాదులను సాధ్యమైనంత వరకు పరిష్కరించామన్నారు. బుధవారం పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తికాగా.. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వేగవంతం చేశామన్నారు. సమావేశంలో ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

మహబూబాబాద్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు జిల్లాలోని 59మద్యం దుకాణాలు, 9బార్ అండ్ రెస్టారెంట్లు, 159 కల్లు దుకాణాలను మంగళవారం సాయంత్రం మూయించివేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్‌నాయక్ అన్నారు. గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు మద్యం దుకాణాలు మూసి ఉంచాలని, ఎలాంటి క్రయవిక్రయాలు జరపొద్దని సూచించారు. ఏజెన్సీలోని గంగారం, బయ్యారం, గార్ల, కొత్తగూడ మండలాల్లో సైతం మద్యం దుకాణాలను మూసి ఉంచాలని ఆదేశించారు. మద్యం షాపుల నుంచి బెల్ట్‌షాపులకు కానీ, చిల్లర వర్తక దుకాణాలకు కానీ మద్యం బాటిళ్లను సరఫరా చేసినా.. అమ్మినా.. ఇతర ప్రదేశాల్లో నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా మద్యం పంపిణీ, అమ్మకాలు జరిగితే ఎక్సైజ్ శాఖ అధికారుల నంబర్లకు కానీ, ఎక్సైజ్‌శాఖ కంట్రోల్ రూం నంబర్, టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. డీపీఈఓ 87126 58998, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి 87126 59026, మానుకోట ఎక్సైజ్ సీఐ 87126 59014, తొర్రూరు ఎక్సైజ్ సీఐ 87126 59015, గూడూరు ఎక్సైజ్ సీఐ 87126 59013, కంట్రోల్ రూం 8719 298533 నంబర్లలో సమాచారం అందించాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మహబూబాబాద్ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో టౌన్ సీఐ సతీష్, ఎస్సైలు విజయ్‌రాంకుమార్, దీపికారెడ్డి, తాహెర్‌బాబా మంగళవారం జిల్లా కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో అన్ని రకాల వాహనాలు, ఆర్టీసీ బస్సులను తనిఖీ చేశారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

- రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్



మాట్లాడుతున్న మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

తొర్రూరు: కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిందని, అది కాస్త ఇప్పుడు ఎఫ్ఆర్ఎస్(ఫ్యామిలీ రాజ్ సమితి)గా మారిందని, కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి లేగా రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం మండల కేంద్రంలో విజయ సంకల్ప సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, కానీ కేసీఆర్ కుటుంబంలో అందరికీ రాజకీయ కొలువులు దక్కాయన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అవినీతి, అరాచకాలు పెరిగాయని, కేసీఆర్ అవినీతితో మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణలో లక్షల కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని, మత ఆధారిత రిజర్వేషన్లు తొలగించి ఎస్సీ, ఎస్టీలకు ఆ రిజర్వేషన్లు పంచుతామన్నారు. తెలంగాణలో సుపరిపాలన అందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని, దానికి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సభలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, నాయకులు యాప సీతయ్య, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, చీకటి మహేష్, పూసాల శ్రీమాన్, సుంకరనేని కోటేశ్వర్, పల్లె కుమార్, కొలుపుల శంకర్, రంగు రాములు, సాయిని ఝాన్సీ, రచ్చ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటేయండి



రాయపర్తి: సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ద్విచక్ర వాహన ర్యాలీ
- ముగిసిన ఎన్నికల ప్రచారం

పాలకుర్తి: అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఓటెయ్యాలని బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సభలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎస్. సుధాకర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి, వల్మిడి, బమ్మెర గ్రామాల్లో కవులు, రచయితలు పేరును నిలబెట్టుకునే విధంగా సుమారు రూ.100 కోట్లతో నూతన భవనాలు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. తాను 40 సంవత్సరాలుగా రాజకీయ జీవితంలో ప్రతీ రోజు ప్రజల కోసం పని చేస్తున్నానని, ప్రజలు ఈ విషయం గమనించి మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. పాలకుర్తి మండలంలో మంత్రి దయాకర్‌రావు ఆధ్వర్యంలో 200 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, సర్పంచ్ యాకాంతరావు, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్ రావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రావు సేవలు గుర్తు పెట్టుకోవాలి

నియోజకవర్గంలో మంత్రి దయాకర్‌రావు చేసిన అభివృద్ధి పనులను గుర్తు పెట్టుకొని ఓటు వేసుకోవాలని మంత్రి సతీమణి ఉషాదేవి అన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

రాయపర్తి: కాంగ్రెస్ నాయకుల మాటలు విని మోసపోవద్దని పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల సమావేశానికి 30వేల లోపే జనం వచ్చారని, మొన్న తొర్రూరులో కేసీఆర్ సభకు 1.16వేల మంది, పాలకుర్తి హరీశ్‌రావు రోడ్ షోకి 80వేల మందితో హాజరయ్యారన్నారు. వీరంతా అభిమానంతోనే వచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, వైస్ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, వనజారాణి, నర్మద, భూక్య క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సతీమణి ప్రచారం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలని కోరుతూ మండలంలోని తిర్మలాయపల్లి తెట్టెకుంట తండాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషాదేవి ప్రచారం నిర్వహించారు. అలాగే మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం మండలకేంద్రంలో మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదు

పెద్దవంగర: రాష్ట్రంలో ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్, మంత్రి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు చిన్నవంగర, గంట్లకుంట గ్రామాల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిన్నవంగర ఎంపీటీసీ మెట్టు సౌజన్య నగేష్ ఇటీవల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో చేరగా అతడి అనుచరులు ఉషాదయాకర్‌రావు సమక్షంలో 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉషాదయాకర్‌రావు మాట్లాడారు. నాయకులు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, పాకనాటి సునీల్ రెడ్డి, సోమారెడ్డి, జలగం శేఖర్, విజయ్‌పాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రావుకు మద్దతు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన గోసంగి కులస్తులు బీఆర్ఎస్ నాయకుడు తాళ్లపల్లి యాకయ్య ఆధ్వర్యంలో ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంగళవారం తమ మద్దతు తెలిపారు.

మరో అవకాశం కల్పించండి

తొర్రూరు: పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోమారు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో భారీ రోడ్ షో నిర్వహించారు. దయాకర్‌రావుకు మద్దతుగా వేలాది మంది బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీపీ చిన్న అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, నాయకులు తిరుపతిరెడ్డి, సోమేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



తొర్రూరులో రోడ్ షోకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



తెట్టెకుంటతండాలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు

గెలిపించండి.. మీ వెన్నంటే ఉంటాం



పాలకుర్తిలో రోడ్‌కు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు



రోడ్‌షోలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

- అమెరికాకు పోతామని చెప్పే కుట్రలను నమ్మొద్దు
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



తొర్రూరు: ర్యాలీలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి



రాయపర్తి: అభివాదం చేస్తున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపిస్తే మీ వెన్నంటే ఉంటానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో పాలకుర్తి మండల కేంద్రంలో భారీ ర్యాలీ ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తిలో ప్రజా సేవ చేయడానికి వస్తే మంత్రి దయాకర్‌రావు ఒక ఆడపిల్ల అని చూడకుండా ముప్పుతిప్పలు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయమన్నారు. తొర్రూరు మండలం గుర్తూరులో 70 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి పాలకుర్తి నిరుద్యోగ యవతకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామన్నారు. పాలకుర్తి నియోజకవర్గ వాసులు చేతిగుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని, మంత్రిని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు.

పాలకుర్తిలో జరిగేది కురుక్షేత్ర యుద్ధం

పాలకుర్తిలో జరిగేది ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధమని, ధర్మం అధర్మం, నాయ్యం, అన్యాయం మధ్య జరుగుతున్న ఎన్నికలని టీపీసీసీ సభ్యురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆదరణ చూసి మంత్రి దయాకర్‌రావు పెట్టిన ఇబ్బందులను గుర్తుకు చేసుకొని ఝాన్సీరెడ్డి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. పాలకుర్తి ప్రజలు తమ కుటుంబంపై చూపించిన ప్రేమ, అభిమానం గుర్తు చేశారు. పాలకుర్తి ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్విని రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, నాయకులు పాల్గొన్నారు. పాలకుర్తి మండలం ఈరవెన్ను సర్పంచ్ ముస్కు నిర్మల చంద్రబాబు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రాయపర్తి: నా కోడలు యశస్వినిరెడ్డిని గెలిపిస్తే మీ వెన్నంటే ఉంటామని, అమెరికాకు తిరిగి వెళ్లిపోతామని చెప్పే కుట్రలను నమ్మొద్దని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాయపల్లి, జేతురాంతండా గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తొర్రూరు, ఖమ్మం తదితర నగరాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశానని మీరు గెలిపిస్తే పాలకుర్తి అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఈవీఎం మిషన్ రెండో నంబర్‌లో ఉన్న చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, జినుగు రత్నాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, మచ్చ కుమారస్వామి, ఎనగందుల మురళి, శ్రీనివాస్, గుగులోతు విజయ్, యాకూబ్ పాల్గొన్నారు.

మార్పు కోసం గెలిపించండి

తొర్రూరు: పాలనలో మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని, పాలకుర్తిలో ఆడబిడ్డకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, బ్యాండ్ మేళాలతో కాంగ్రెస్ శ్రేణులు యశస్వినిరెడ్డికి మద్దతుగా హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన 15 ఏళ్లలో పాలకుర్తికి మంత్రి దయాకర్‌రావు చేసింది శూన్యమన్నారు. ఎమ్మెల్యేగా గెలవగానే పాలకుర్తి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, నాయకులు కాకిరాల హరిప్రసాద్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, బాపురెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పాలకుర్తి' తీర్పు ఆదర్శం కావాలి

కొడకండ్ల: పాలకుర్తి ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అండగా ఉండి మీరిచ్చే తీర్పు రాష్ట్రానికే ఆదర్శం కావాలని అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం నర్సింగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రెండో వార్డు సభ్యుడు నూనెముంతల ఎల్ల గౌడ్, వెంకట్రాములు ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యశస్వినిరెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లకు పైబడి నుంచి తన సొంత గడ్డపై మమకారంతో మా అత్తమామలు రాజేందర్‌రెడ్డిఝాన్సీరెడ్డి అనేక సామాజిక సేవ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. పాలకుర్తి ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజలకు ప్రత్యక్ష సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థి దయాకర్‌రావు అనేక అడ్డంకులు సృష్టించినా నమ్ముకొన్న వారికి అండగా ఉండాలనే సంకల్పంతోనే వారసురాలిగా తనను బరిలోకి నిల్పిందన్నారు. పాలకుర్తిలో జరిగే ధర్మ సంగ్రామంలో ఆడబిడ్డను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి మార్క్ చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనర్సయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, వంశీకృష్ణ, పనస రాంధాస్‌గౌడ్, వీర్యానాయక్, యాకూబ్ పాల్గొన్నారు.